
# మంత్రనగరి సరిహద్దులలో...



శీతాకాలపు తొలిజాము...

రాత్రి తాలూకు బెంగ పూర్తిగా వదిలి పోకుండానే అప్పుడే పావు తక్కువ యెనిమిదయింది. వూఁ... మరో ఐదు నిమిషాలు అని మునగ దీసుకొంది.

వూహు... యిలా కాదు. లేవాలి. చాలా పనుంది. వూహు... యిది యిలా వదలదు... కాఫీ... చిక్కని సౌత్ యిండియన్ కాఫీ... యస్ గుడ్ ఐడియా - మంచంపై లేచి కూర్చుంది. లే, త్వరత్వరగా. కాఫీ కలుపుకొని తాగింది.

కాన్ఫరెన్స్ వుంది. అక్కడే బ్రేక్‌ఫాస్ట్. త్వరత్వరగా రెడీ అయింది. యింటికి తాళంవేసి పార్కింగ్ లోంచి కారు తీస్తుంటే 'గ్యాస్ ఆఫ్ చేసానా లేదా' మనసులో యెప్పటిలా సందేహం. 'వూ... తిరిగి మూడంతస్తులకెళ్ళాలి' అనుకొంటూ ఆపేను కదా... అసలే టైమ్ లేదు.

వూహు... యిప్పుడు చూడకపోతే తిరిగి యింటికొచ్చేవరకు మనశ్శాంతి వుండదు. చూసొస్తే... కారు దిగింది. లిఫ్ట్ దగ్గరికి వెళ్ళింది. యిందాక వరకూ బాగున్న లిఫ్ట్ మధ్యలో యెక్కడో ఆగిపోయిందంట. త్వరత్వరగా మెట్లు యెక్కుతూ యెప్పుడూ యేదో వొక ఫాల్టే యీ లిఫ్ట్‌లో... అస్సలు నమ్మటానికి లేదు. తాళంతీసి వంటింట్లోకి చూసింది. గ్యాస్ ఆఫ్ చేసుంది. వూ... రోజూ యిదో గొడవ. సందు మొదట్లోనో ఆఫీసు గుమ్మంలోనో గ్యాస్ ఆఫ్ చేసానో లేదో కుళాయిలన్నీ కట్టానో లేదో యింటికి తాళం వేసానో లేదో - యిలాంటి సందేహాలు సంశయాలు... టైమ్ అయిపోతోంది... త్వరత్వరగా... కారు సందు మలుపు తిరిగిందో లేదో తాళం వేసానా... సందేహం. వూహు... వేయకపోయినా యేం కాదు.

గ్యాస్ ఆఫ్ చేసుంది. కుళాయిలన్నీ కట్టున్నాయి. నీళ్ళు పోతే పెద్ద గొడవలై పోతాయ్ అపార్ట్‌మెంట్‌లో. వో... ప్రోగ్రామ్ షీట్ మర్చిపోయా... ఆఁ అక్కడ తీసుకోవచ్చులే.

అలవాటైపోయిన కాన్ఫరెన్స్‌లు.. మీటింగ్స్... డిస్కషన్స్. వో. పోటీ... వో పరుగు... లాభం... దీనికో మానవ ముఖం...

కాఫీ షాప్‌లోకి వొచ్చింది.

యెక్కడెక్కడి నుంచో వచ్చిన డెలిగేట్స్. పలకరింపులు... రొటీన్...

కొన్ని కట్‌ఫ్రూట్స్, యిడ్లి తీసుకొని వొచ్చి వో టేబిల్ దగ్గర కూర్చుంది. సౌత్ యేసియన్ బిజినెస్ డీల్. అభివృద్ధి చెందిన దేశంతో డీల్...

సరిగ్గా హేండిల్ చేయకపోతే సి.యి.వోతో గొడవ. టార్గెట్ రీచ్ కావాలి. పని చేయొచ్చు... చేస్తాం... కానీ యెందుకో అస్సలు వుత్సాహంగా అనిపించటం

లేదు. తన చుట్టూ వున్నవాళ్ళ భాషకి తన భాషకి పొంతన లేదు... ఆలోచనలు... చూపులు ఫ్రెంచ్ విండో నుంచి ఆకుపచ్చని పచ్చికపై వొత్తుగా రాలిన పున్నాగ పువ్వుల పైకి. సూర్యకాంతి మంచు కలగలిపి కనిపించే మేరంతా రేగుతున్న వూదా వెలుగు పొరలుపొరలుగా... కాఫీ ఆఖరి సిప్ చేస్తూ క్షణం చూపుల్ని నమ్మలేక విదిల్చింది. ఆ పచ్చని పచ్చిక మీద వొత్తుగా రాలిన పున్నాగపువ్వులని దోసిలి నిండా తీసుకొని ముద్దు పెట్టుకొంటూ గుండెల నిండుగా ఆ సుగంధాన్ని నింపుకొంటున్న యువకుడు. సీగ్రీన్ ఫుల్‌స్లీవ్స్ చొక్కా... పక్కగా కనిపిస్తోన్న వొత్తైన తేనెరంగు క్రాఫ్... కనీకనిపించని పల్చని నల్లని గెడ్డం... ముఖం పూర్తిగా కనిపించక ముందే ఆ కుర్రాడు మాయమైపోయాడు.

యెవరీ కుర్రాడు...పున్నాగలని ముద్దుపెట్టుకొన్న వాడు... యెంత కాలమయిందో యిలాంటి కుర్రాడిని చూసి... అసలెప్పుడైనా చూసావా... కలలో... మెలకువగా... మగతగా... వో స్వప్నంగా... వో వూహగా... లోలోపలెక్కడో వో మృదువైన భావాన్ని నెమలి యీకల్ని స్పృశించినట్టు మెత్తని చిన్ని వుత్సాహం...

కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్ళేసరికి పలకరింపులు... పరిచయాలు... జ్యోతి ప్రజ్వలన సక్సెస్‌ఫుల్ పీపుల్.. యెంటర్‌టైన్‌మెంట్ వో పెద్ద వ్యాపారం. త్వరత్వరగా డబ్బులు సంపాదించుకోడానికైనా... పోగొట్టుకోడానికైనా అగ్రిమెంట్స్... బిజినెస్ స్కిల్స్ మార్కెట్ నాడి... చకచకా ఆలోచనలు తిరుగుతున్నాయామెలో. మధ్యలో కుర్రాడి జ్ఞాపకం సుగంధంలా, తలొంచుకొని ఆలోచిస్తోంటే మధ్యమధ్యలో డయాస్‌పై నుంచి మాట్లాడుతోన్న వాళ్ళ ఆలోచనలు'భావాలు అభిప్రాయాలు ముక్కలుముక్కలుగా వినబడుతున్నాయి... స్పీచ్ - స్వరం రెండూ తన ఆలోచన లని లాక్కుంటుంటే ఆసక్తిగా అనిపించి మాట్లాడుతుందెవరాని కనురెప్పలు యెత్తింది. ఆ కళ్ళల్లో విస్మయపు చిరునవ్వు విరిసింది.

పున్నాగలని ముద్దు పెట్టుకొన్న కుర్రాడు.

మృదువుగా అతని మాటలు సాగుతున్నాయి.

యేం పేరో... యే కంపెనీ నుంచో... యే సిటీ నుంచో... ప్రోగ్రామ్ షీట్ కోసం ఫైల్లో చూసింది కనిపించలేదు. రెండుమూడు కాగితం పడవలు కనిపించాయి. ఆలోచనల్లో కొట్టుకుపోతున్నప్పుడు చేతికి యెదురుగా యే కాగితం కనిపిస్తే ఆ కాగితంతో చిన్నిచిన్న పడవలు చేసేసే అలవాటు. ప్రోగ్రామ్ షీట్ ముక్కలు

ముక్కలుగా చిన్నిచిన్ని పడవలుగా. యే పడవలో యీ కుర్రాడి పేరు వెతకాలి...

అతని స్పీచ్ అయింది... లంచ్ బ్రేక్.

బాంబే నుంచి వొచ్చిన సహదేవ్ జోషి డీల్ విషయం మాట్లాడుతుంటే అసలా కుర్రాడిని చూడటమే వీలుకాలేదు. ఆరుగంటలప్పుడు ఆరోజు కాన్ఫరెన్స్ అయ్యింది. 'పార్టీలో కలుద్దాం' అన్నాడు సహదేవ్ జోషి.

"వూఁ..." ఆ పార్టీ... వొకే మూస పార్టీ... రిక్రియేషన్ రిలాక్సేషన్... మూస.. యిలా పార్టీల్లో కలిస్తే వొకరి మధ్య వొకరికి మెరుగైన సంబంధాలు వొస్తే మెరుగైన లాభం వస్తుంది. 'హలో' దాటని సామూహిక గెట్ టు గెదర్స్... పూర్తిగా అవుటాఫ్ ద ప్లేస్‌గా అనిపించటం... యిదంతా తానొక్కదానికేనా... వేరువేరు రంగాల్లో పనిచేస్తున్నవాళ్ళు... వొక్కో వొంటరి ద్వీపాల్లా... అసలిలా పువ్వుల్ని పాటల్ని మంచుని మబ్బుని వానని మట్టివాసనని ప్రేమని లోపలికి నింపుకోవాలనుకోవటం... వెతుక్కోవటం... పార్టీకి టైమ్ అవుతోంది... వెళ్ళాలి... తప్పదు... అదే మెనూ... అవే డ్రింక్సూ... అవే పలకరింపులు... బోర్... సత్ సంబంధాలు... వర్క్‌ప్లేస్‌లో... రిలాక్సేషన్... రిక్రియేషన్... నమూనాగా... సర్వాంతర్యామి బిజినెస్ టవర్స్ కూలితే యిక్కడ వుద్యోగం రావొచ్చు... పోవొచ్చు... యింటా బయటా మొత్తం యీక్వేషన్స్ మారొచ్చు... తలకిందులు కావొచ్చు... యేం కాకపోవొచ్చు...

పార్టీ కార్డ్ తీసింది. డ్రస్ కోడ్ చూసింది.

రెడీ అయి హోటల్‌కి వచ్చింది.

టాప్‌ఫ్లోర్‌లో ఆ హాల్లో కాసేపు ఆ హడావుడి చూస్తుంటే ఆ కుర్రాడు కనిపించాడు – ఢిల్లీ నుంచి వచ్చినవాళ్ళతో మాట్లాడుతూ... పలకరిస్తే... వూహూ... వొద్దు... ఆ క్షణంలో అతనికి ఆ పువ్వులని పలకరించాలనిపించదేమో... తనే యెక్కువగా ఆలోచిస్తుందేమో...

అందరి ముఖాలలో వుల్లాసపు నవ్వులు-వుత్సాహవంతమైన చూపులు... కానీ ఆ సుశిక్షితమైన నవ్వులు చూపులు మాటల్లో ఘనీభవించిన మోనాటని రవ్వంతైనా లేని విలక్షణత... బట్టల్లో హెయిర్‌స్టయిల్స్‌లో కాస్మొటిక్స్‌లో బోల్డంత వైవిధ్యం... మరొక్కసారి చూడాలనిపించే రంగులు డిజైన్స్... వొప్పుకొన్న ఆమోదించబడిన ప్రపంచపు నమూనా సౌందర్యం... యీ స్టాండర్డ్ సౌందర్యం...

మనసులో ఆలోచనలే ఆలోచనలు...

హాల్లోంచి బయటికి వచ్చింది. రూఫ్‌గార్డెన్‌లోకి వొస్తుంటే సన్నగా కురుస్తోన్న మంచు... క్షణంలో అరిచేతులు ముఖం చల్లగా అయిపోయాయి. రెండు అరి చేతుల్ని మెల్లగా రాస్తే చిన్ని వెచ్చదనం. అరిచేతుల్ని బుగ్గలకి ఆనించింది. లేత వెచ్చదనం...

"హా... బోలో..."

తలతిప్పి చూసింది.

పున్నాగపువ్వుల కుఱ్ఱాడు సెల్‌ఫోన్‌లో యెవరితోనో బయటకొచ్చి మాట్లాడు తున్నాడు.

"ఆఁ... టేక్ కేర్..."

పసుపు గులాబిరేకులు కలిపినట్టు మెరుస్తోన్న పచ్చని చర్మపురంగు. పల్చని నల్లని గెడ్డం నడుమ లేత గులాబిరంగులో వంపు తిరిగిన పెదవుల మధ్య నుంచి తెల్లగా మెరుస్తోన్న పలువరుస... నవ్వుతోంటే కళ్ళల్లో పల్చని బుగ్గల్లోకి ప్రవహిస్తోన్న మెరుపు. లేత చొక్కా కాలర్‌లోంచి కనిపిస్తూ వంపు తిరిగిన కాలర్ బోన్. వెడల్పాటి ఛాతి. పొడవైన చేతివేళ్ళ లేతదనం. చురుకైన కళ్ళు. అర్ధచంద్రుని లాంటి నుదిటిపైకి వాల్తున్న వొత్తైన జుట్టు తేనెరంగులో. మాట్లాడటం అయి సెల్ మూస్తోంటే కమ్ముకొంటున్న చూపుల పరిమళం. ఆమె పైనే అతని చూపులు.

ఆమె చూపులు తిప్పుకోలేదు. "మీకు పున్నాగ పువ్వులంటే యిష్టమా..." అతని భాషేంటో తెలియక యింగ్లీషులో చప్పున అడిగింది.

ఆమె అడిగిందేంటో అతనికి అర్థం కాలేదు.

"యేంటండి" నమ్రతగా యింగ్లీషులో అడిగాడు.

"పొదయం మీరు లాన్‌లో పువ్వుల్ని ముద్దు పెట్టుకొన్నారుగా..."

విచ్చుకొన్న అతని కనురెప్పల్లోంచి పరిమళిస్తోన్న నవ్వు.

"మీరు వాటిని పున్నాగలంటారా..." అడిగాడు.

"మీరు..."

"ఆకాశమల్లిక"

"ఆకాశమల్లికా"

"యస్... ఆకాశమల్లికా..." అన్నాడు.

"వో"

"వుదయం సెషన్‌లో మీరున్నారుగా"

"వూ..."

"టాపిక్ నచ్చలేదా..." అడిగాడు.

"యే టాపిక్..."

"యేమో... వుదయం డయాస్ మీద నిల్చుని డెలిగేట్స్ వైపు చూస్తున్నా... మీకేం సంబంధం లేనట్టు హేపీగా పడవలు చేసుకొంటూ కనిపించారు" అన్నాడతను.

"మధ్య నుంచి మీ స్పీచ్ విన్నా" అందామె.

"విన్నారా... కాగితాలు అయిపోయి యేం చెయ్యాలో తెలియక వింటున్నట్టున్నా రనుకొన్నా" చిన్న నవ్వు కొంటెగా...

"పూర్తిగా వినలేదు... నాలుగు లైన్స్... బాగున్నాయి అనుకోగానే చూసా. మీరు... అంతే యింకేం వినను... ఆ పువ్వులే..."

"అరే... మీకో విషయం చెప్పాలి... అసలా పువ్వులు యేంటో తెలియదండి... వాటిని దేనికైనా వాడొచ్చేమోనని కూరియాసిటీతో వాసన చూసా... అంతే మీరిం కేదో అనుకున్నారనుకొంటా... పేటెంట్ కోసం" అన్నాడు.

"అవునా... మీకా పువ్వులంటే యిష్టంలేదా..."

"యిష్టం యేమిటండి... యిప్పుడేగా చూసింది"

"అవునా"

"చూసారా... యింత చదువుకున్నారు... పెద్ద వుద్యోగం... యిలా పువ్వుల్ని, పిట్టల్ని, కవిత్వాన్ని అబ్బాయిలు ముట్టుకోగానే అవి వాళ్ళకి యిష్టం అని అను కొంటే యెలా... డెలిగేట్స్ స్పీచ్ కంటే పువ్వులు యిష్టమైనప్పుడు పువ్వుల

యెక్స్‌పోర్ట్ బిజినెస్‌లో వుండకపోయారా... యీ యెంటర్‌టైన్‌మెంట్ బిజినెస్‌లో కాకుండా...''

బుద్ధి లేదు నాకు అనుకొంటూ తల తిప్పుకొని లోపలికి వెళ్ళబోతుంటే ''బంజారా లైన్‌లో సముద్రంలా వుంటాయి యీ ఆకాశమల్లికలు... వొస్తే చూసిస్తా'' అన్నాడు.

ఆగి అతనివైపు చూస్తూ ''పువ్వులని యిష్టపడ్డారని కాదు. అందమైన కళ్ళున్నాయని స్పీచ్ వినలేదు'' అందామె.

''యీ చిన్ని కళ్ళా''... కొంటెగా అడిగాడు.

''చిన్నవో పెద్దవో... ఆ కళ్ళల్లో మెరుపుంది'' అంది.

''మెరుపు... జాగ్రత్త వురుములు కూడా కనిపించగలవ్...''

''యిందాక యేదో సముద్రంలా పువ్వులన్నారు'' అడిగింది.

''రండి''

''వూ'' అంది అతని పక్కగా అడుగులేస్తూ.

''యేంటి వచ్చేస్తారా...'' ఆశ్చర్యంగా అడిగాడు.

''ఆఁ''

''పార్టీ''

''బోర్''

యిద్దరు బయటకొచ్చారు.

అతను డ్రైవ్ చేస్తూ టేప్ రికార్డర్ ఆన్ చేసాడు.

మెహదీహాసన్ మెత్తని స్వరం...

''యిష్టమా'' అడిగింది.

''చాలిష్టం''

కారు విశాలమైన రోడ్లు దాటి వో చిన్ని సందు మొదట్లో ఆగింది. కారు గ్లాసుల్లోంచి

చూస్తుంటే ఎదురుగా కనుచూపు మేరంతా మంచువెన్నెల్లో వొత్తుగా పున్నాగలు.

కారు దిగింది. పూలసుగంధపు చల్లని పలకరింపు.

చలి వణికిస్తోంటే రెండు చేతులు ముడుచుకొని కారుకి ఆనుకొని నిలబడి వాటివైపే చూస్తుందామె.

చేతులు కట్టుకొని కారుకి ఆనుకొని పక్కగా నిలబడి చూస్తున్నాడతను. ఆమెని, పరిసరాలని మర్చిపోయి ఆలోచనల్లోకి అతను వెళ్ళిపోతుంటే "మీకీ ప్లేస్ యెలా తెలుసు" అడిగింది.

"కలొచ్చింది"

"యేమని"

"యీ పూలని యిష్టపడే వో అమ్మాయి యెదురుకాబోతోంది. యీ పూలని యిలా చూపించావంటే బోల్డంత సంబరపడుతుంది" అంటూ నవ్వాడు కొంటెగా.

చెమ్మగా కురుస్తోన్న వెన్నెల్లో పల్చని అగరుపొగలా పున్నాగల పరిమళం ఆవరిస్తోంటే మనసంతా అలజడి. అతను నవ్వాడు గోర్వెచ్చగా.

"వెళదామా" అడిగాడు.

"అప్పుడే...."

"యీ కాలమంతా యివి యిలానే వుంటాయ్... రావాలనుకున్నప్పుడు రావొచ్చు..." చెప్పాడతను.

"మరో ఐదు నిమిషాలు" అడిగిందామె.

"వూ"

"మీరు చాలా బాగా పనిచేస్తారని జోషి చెప్పారు. యీమధ్య జాయిన్ అయ్యారంట కదా... యేంటి మీ సక్సెస్ ఫార్ములా" అడిగాడు.

"జోషిని... యెప్పుడు అడిగారు" అడిగింది.

"లంచ్‌లో... పడవలు చేసుకునే అమ్మాయి యింత పెద్ద విషయాల్లోకి యెలా వచ్చారని" అన్నాడు.

''అప్పుడే యెంక్వైరీ కూడా చేసేసారా'' అందామె.

''ఆ... మీ ఐదు నిమిషాలు అయింది. వెళదామా...'' అడిగాడు.

''వూ''...

కారు తీసుకొని యింటికి వెళుతుంటే అతని పేరేంటో... అనుకోగానే నవ్వొచ్చిందామెకి. పేరు కూడా తెలుసుకోన్కర్లేనంత దగ్గరగా యెందుకనిపించారో...

✦

ఆఫీసులో పనే పని... చేస్తున్నంతసేపు యెప్పుడెప్పుడు సాయంకాలమవు తుందానే యెదురుచూపు. అతని నెంబర్ తెలియదు. నిన్న ప్రోగ్రామ్ షీట్ చూస్తే... ప్చ్! చూద్దాం అతనే కాల్ చేస్తారేమో... అతను తన నెంబర్ యివ్వలేదు. కాల్ చేస్తే బాగుండదేమో... అనే ఆలోచనలు సంశయాలతో యింటికి వొచ్చింది. యింట్లో ఆ పని యీ పని చేస్తున్నా ఆలోచనలన్ని అతనివైపు తిరుగుతున్నాయి. అతన్ని యెలా కాంటాక్ట్ చెయ్యాలి. ఫోన్ మోగితే అతనేనేమోననే ఆత్రంతో లిఫ్ట్ చేయటం. కాకపోయేసరికి బోల్డంత నిరాశ. సమయం గడుస్తోన్నకొద్దీ అతనింక యీరోజుకి ఫోన్ చేయరని రూఢిగా అనిపిస్తోంటే బరువెక్కుతోన్న బెంగ. వొత్తైన చలికి కళ్ళు మూతలు పడుతోంటే మోగుతోన్న సెల్.

''హలో''

''చాలా ఆలస్యంగా చేస్తున్నా... పర్లేదా''

''హాయ్‌ః... చెప్పండి చెప్పండి... యెక్కడున్నారు. వుదయం నుంచి వొక్క సారైనా కాల్ చేయొచ్చుగా'' అడిగింది.

''మీరు నిన్న కాల్ చేయమని అడగలేదుగా...''

''మరి యిప్పుడెలా చేసారు...''

''మీకు కాల్ చేయవచ్చో లేదో కనుక్కుందామని''

''నెంబర్ యెక్కడిది''

''చెప్పుకోండి చూద్దాం''

''తెలియదు''

"మీరే గెస్ చేయండి... యింతకీ మీకు కాల్ చేయొచ్చా..."

"వద్దంటే మానేస్తారా"

"అవన్నీ కనుక్కొని చెపుతారా మీ జవాబు"

"యెక్కడున్నారు"

"రోడ్డు మీద"

"మీ యిల్లెక్కడ"

"రండి" అంటూ గుర్తులు చెప్పటం అయిందో లేదో అతని సెల్ చప్పున కట్ అయింది. ఛార్జ్ అయిపోయినట్లుంది.

అతను యిల్లు గుర్తుపట్టగలడో లేదో... అతనికి తెలియకపోతే వెళ్ళిపోతాడేమో... బాల్కనీలోకి వచ్చింది. జివ్వుమన్న చలి. కాలనీ అంతా నిశ్శబ్దంగా వుంది. మంచు మసకతెరల్లోంచి మబ్బుమబ్బుగా మిలమిలలాడుతోన్న తారకలు. దూరంగా కాలనీ సందు మొదట్లో కారు హెడ్‌లైట్ల కాంతిపుంజపు నీడలు.. టైర్ల సవ్వడి... అతనిదేనా. కుక్కల అరుపులు... మెల్లగా తిరిగి నిశ్శబ్దం. మలుపు చివరి వరకు వచ్చి ఆ కారు వెనక్కి తిరిగింది. వోహ్... అది డెడ్ యెండ్ అనుకుని తిరిగిపోయి వుంటాడు. పక్కనే సందుంటుంది. కనిపించదు త్వరగా... అంతా అక్కడికే ఆఖరు అనుకుంటారు... అరే... అనుకొంటూ లోపలికొచ్చి యెనీలక్ అనుకొంటూ సెల్‌కి కాల్ చేసింది. నో వే... పలకటంలేదు... యెలా... ఆదుర్దా... వొకేవొక్క క్షణం ఆలోచించి యింటికి తాళంవేసి రోడ్డు మీదికి సెల్ తీసుకొని వచ్చింది. అతను తిరగివొస్తే ఆపొచ్చును. నిర్మానుష్యమైన ఆ చల్లని మంచు నడిరాత్రి చిరపరిచిత మైన సందు మొదట్లో వస్తాడో రాని తెలియని అతిథి కోసం యెదురుచూస్తూ వొంటరిగా అలా నిల్చుంటే ఆమెకి అనిపించింది. 'నువ్వత్తి అమాయపు పిల్లవి. యెందుకింత ఆరాటం... ఆదుర్దా... రావాలని అనుకొంటే యెలాగైనా వస్తారు. పాపం... దారి తెలియదు కదా... వదిలేసి నువ్వే వెతుక్కో అంటే ఎలా...' సెల్ మోగింది.

"ఛార్జర్ అయిపోయింది. యింటికి చేసాను. నో రెస్పాన్స్. యెలా రావాలి" అడుగుతున్నాడు.

"మీరిప్పుడు యెక్కడున్నారు"

"మెయిన్‌రోడ్డుపై. వో ఎస్.టి.డి. బూత్ నుంచి"

"మీరు లోపలికి వచ్చారు కదా. అలానే రండి. బైలైన్స్ తిరక్కండి. నే రోడ్డు మీదే కుడివైపు నిలబడి వున్నా"

"బయటికి వచ్చారా" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆఁ"

"వస్తున్నా"

అతనీ చీకట్లో గుర్తుపడతాడా... యీ వీధిదీపాలు పగటి వెలుతురులానే వున్నట్టున్నాయి... కారు హెడ్‌లైట్స్... ఆమె పక్కగా ఆగాయి.

అంత రాత్రి, చలిలో వొంటరిగా తన కోసం యెదురుచూస్తూ నిలబడిన ఆమెని చూస్తుంటే అతనికి యింతకుముందెప్పుడూ కలగని చిత్రమైన భావన అపురూపంగా మెదిలింది. అంతలోనే చిన్న భయమూ కలిగింది. "యింత రిస్క్ తీసుకున్నారా. యెలాగో మిస్ అయ్యా"

ఆమె నవ్వి కారెక్కి దారి చూపించింది.

"యింత లోపలికి యిల్లు మీకెలా దొరికింది" అడిగాడు.

"కాలుకి తగిలింది"

కొన్ని పని కబుర్లు, కాసింత సాహిత్యం... కాసిన్ని పాటలు, మాటలు, నవ్వులు. చిక్కని కాఫీ సువాసనల్లోంచి దొర్లుతున్నాయి.

"యింక వెళతా... వుదయమే కూలికి పోవాలి" అన్నాడు.

"యే లొకేషన్"

"వస్తారా"

"వూ"

"వెళతా... వుదయం కాల్ చేస్తా..."

"అప్పుడే"

"టైమ్ చూడండి"

"వాచ్ తీసేస్తా" అంది.

కళ్ళల్లోకి చూస్తూ నవ్వుతూ "యింకెంతసేపు" అడిగాడు.

యింత సమ్మోహనంగా నవ్వుతుంటే యెంతసేపైనా... అనుకొంటుంటే ఆమెకే నవ్వొచ్చింది.

"నవ్వుతారేంటి చెప్పండి" అడిగాడు.

"ఐదు నిమిషాలు"

"నిజంగా..." అడిగింది.

"నిజంగానే కానీ యేభై నిమిషాలు మీరు మాట్లాడుతూనే వుండాలి" అన్నాడు.

"జాతిని వుద్దేశించి ప్రసంగించాలా"

"మీ యిష్టం... కానీ ఆ తర్వాత 'మరో ఐదు నిమిషాలు' అని అడక్కూడదు."

"అడిగితే యేం... నా యిష్టం అడుగుతా" పెంకిగా అంది.

అతను నిశ్శబ్దంగా నవ్వుతూ "రేపు వస్తున్నారుగా" అన్నాడు.

"వూ" అందామె.

"బై" అతను వెళ్ళిపోయాడు.

కారు పూర్తిగా కనుమరుగయ్యేవరకు బాల్కనీలో నిలబడి చూస్తూనే వుంది. మెల్లగా లోపలికి వచ్చింది.

గమ్మత్తుగా వచ్చిన అతిథిలా... మిత్రునిలా... పలకరింపులా... ఆ సంబరం ఆ రాత్రిని వెచ్చగా పూయించింది.

తెల్లార్తునే అతనెప్పుడు కాల్ చేస్తాడోననే యెదురుచూపు. యెక్కడిదా లొకేషన్... అతను సాయంకాలమైనా కాల్ చేయలేదు. ఆమె అతని సెల్‌కి చేస్తే స్విచాఫ్ చేసుంది.

యెందుకని...

యెందుకిలా తన మనసు పదేపదే అతన్ని కలవరిస్తోంది... యెందుకిలా... కొన్ని వందలసార్లు ఆ ప్రశ్న వేసుకొంది... అయినాసరే మనసు కుదుటపడలేదు. ఫోన్ ఎందుకు చేయలేదు. జవాబు యెందుకివ్వలేదు. హృదయపు వెలితి కనురెప్పల్లోంచి ధారగా... కన్నీటిధారగా... చాలాసేపు ఫోన్ని సెల్‌ఫోన్ని చూస్తుండి పోయింది. యింటికి వచ్చాక కూడా దిగులు ఆదుర్దా వొదల్లేదు. నిద్రపట్టేక అతను ఫోన్ చేస్తే వినిపించదేమో... మెసేజ్ వస్తే వినపడదేమో... ఫోన్స్ పక్కగా వుంచుకొంది... ఫోన్ చేయకపోతే పోని... యెందుకు చేయలేదో... రాత్రంతా కలత నిద్ర.

బెంగగా తెల్లారింది.

చూడకూడదు... యెవరికోసం యెదురు చూడకూడదు. మనకి కావల్సింది దొరకదు. అతనికి తను అక్కర్లేదు. యెందుకిలా కోరికోరి గాయాలు చేసుకోవటం. గాయం అయిందనే యెరుక కూడా లేనివాళ్ళున్నచోట... యెవరి కన్నీళ్ళు వాళ్ళవే. తడుచుకోవాలి. యెందుకీ ఆరాటం... యెందుకీ అన్వేషణ... ఆఫీసులో కూడా తనకి తనే చెప్పుకుంటూ వోదార్చుకుంటూ... పని చేసుకొంటూ రెండ్రోజులు గడిచాయి.

ఆరోజు వుదయం యింతలా డిస్టర్బ్ కాకూడదని... యిష్టాలవైపు రవ్వంత క్రిటికల్ చూపుండాలి... తనకి తనే చెప్పుకొంటూ ఆఫీసుకి బయలుదేర్తుంటే అతను కాల్ చేసాడు.

''హల్లో'' అంది.

''హాయ్ః... బిజీ...'' అడిగాడు.

''చెప్పండి''

''కాసేపయ్యాక కాల్ చేస్తా. పెద్ద బిజీగా లేరుగా'' అడిగాడు.

''వూ''

''బై''

ఫోన్ పెట్టేక ఆమెకి తనలోని మోయలేని బరువేదో తగ్గిపోయినట్టనిపించింది. అతని కాల్ కోసం పరితపించటం... తీసుకొన్న నిర్ణయాలు యెక్కడో పారేసినట్టు అంతా యేమైనట్టు...

ఆఫీసుకి వెళుతూ పాటలు వింటుంది.

అజీబ్ దాస్తా హై యే... - లత స్వరం పరుగులు తీయిస్తోంది మనసుని.

పాట యిలా పూర్తి అయిందో లేదో సెల్ మోగింది. అతనేమోనని ఆత్రంగా చూసింది. కాదు... యింకా కాల్ చేయడేంటీ...

'ఆజారే పరదేశీ'... లత స్వరంలోంచి వస్తుంటే 'యేంటిలా లతాజీకి నా మనసు తెల్సిపోతోంది' అనుకొంటుండగా ఆఫీసు వచ్చేసింది. పని... పని... పని... పనిలో మునిగినా అతని ఆలోచనలు వదలట్లేదు. యే పనిలో వున్నా నిరంతరం యిలా మనసునే అంటిపెట్టుకొని లోలోపల పండిన మొగలి పరిమళం లాంటి యీ మత్తైన సువాసన్నేమంటారో...

అతన్నుంచి ఫోన్.

"బయటికి వెళదామా" అడిగాడు.

"వూఁ"

"మీకేం యిబ్బంది లేదుగా"

"వూహుఁ"

"పది నిమిషాల్లో మీ ఆఫీసు దగ్గరకి వచ్చేస్తా... కిందకి వచ్చేస్తారా"

"వూ"

ఆమె ముఖంలో కాంతి మధ్యాహ్నపు మబ్బులు తొలిగిన ఆకాశంలా.

గట్టిగా చెప్పాలి... యిలా రోజులరోజులు మాయమైపోవద్దని. యింటర్‌కమ్‌లో బాస్ పిలుపు. అతని గదిలోకి వెళ్ళింది.

"అర్జెంట్ మీటింగ్. సింగపూర్ నుంచి వచ్చిన డెలిగేట్స్‌తో. ముందుగా అవసరం లేదనుకున్నాం. కానీ వాళ్ళు అడుగుతున్నారు... క్వాలిటీ... " చెపుతున్నాడు బాస్. యిప్పుడు మీటింగా... బాప్‌రే... లంచ్‌కి వెళ్ళాలి... యివి యెప్పుడూ వున్న మీటింగ్సే... ఆఁ... యేం కొంపలు అంటుకోవ్...

"వోకేనా"

''కాస్త పనుంది. అర్జెంట్... మీటింగ్‌కి వుండక తప్పదా'' అడిగింది.

''అర్జెంటా...''

''వూ''

''చాలా...''

''వూఁ...'' మరింత అమాయకంగా ముఖం పెట్టింది.

యెంత పనున్నా యెప్పుడూ క్షణం తటపటాయించకుండా చేసే ఆమె 'యిప్పుడు వుండలేను' అంటుంటే ''ప్చ్! యిలా అయితే యెలా... మీటింగ్‌కి వుండకపోతే యెలా'' అడిగాడు.

''యెప్పటి పని అప్పటిదే... ప్రతిక్షణం పని చేస్తుండాల్సిందే. నిన్న యెక్కువసేపు చేసాం. చాలా పనిచేసాం... యివి యేవి కుదరవు... నిరంతరం చేస్తుండాల్సిందే. లీవ్ త్వరగా యివ్వరు...

ఆమె కదలకుండా వెళ్ళాల్సిందే అన్నట్టు కూర్చుంది.

''వోకే'' అన్నాడు.

''థాంక్ యూ'' అంది.

''యిట్స్ వోకె... జెండర్ సెన్సిటివిటి యెక్కువని అంతా అంటుంటారు'' అతను అంటుంటే నవ్వేసి త్వరత్వరగా గదిలోంచి బయటికి 'వొచ్చింది.

ఆఫీసులోంచి బయటికొచ్చింది. బిల్డింగ్ ముందున్న తురాయిచెట్టు నీడలో నిలబడింది. శీతాకాలపు మధ్యాహ్నపు యెండ ఆకుల మధ్య నుంచి గోర్వెచ్చగా తగుల్తోంది.

'వ్వా... గత రెండురాత్రుల దుఃఖం... వుదయం నుంచి తీసుకొన్న నిర్ణయాలు యిప్పటివరకూ పడిన కష్టం అవేవి యీ కుర్రాడికి తెలియవుకదా. అతని కారొచ్చి ఆమె ముందు ఆగింది. ఆమె మౌనంగా కూర్చుంది. ''యేం చేస్తున్నారు'' కాస్త దూరం వెళ్ళాక అడిగాడు.

''ప్చ...''

''రివేంజ్'' నవ్వుతూ అడిగాడు.

"ఆ... స్వీట్ రివేంజ్" వుక్రోషంగా అంది.

"యెంత స్వీట్..." కొంటెగా అడిగాడు.

"మీకేం యిలానే అంటారు... యెంతలా చూసానో తెలుసా..."

"అదే యెంతలా..."

"యేడుపొచ్చేంత" చప్పున చెప్పేసింది.

అతనో క్షణం నొచ్చుకున్నట్టు ఆమెవైపు చూసి "అందుకేగా యిప్పుడు మిమ్మల్ని తీసుకువెళుతోంది" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

కారు మందమైన ట్రాఫిక్‌ని దాటుకొని హైవే మీద వెళుతోంది.

తన పని విషయాలని మధ్యమధ్యలో చెపుతున్నాడు. చెప్పటంలో పొంగుతున్న సెన్సాఫ్ హ్యూమర్. హైవే నుంచి కారు కుడివైపున్న రోడ్డులోకి వెళ్ళింది. చిన్నిచిన్న విలేజెస్‌ని దాటుకొని వెళుతున్నాయి. చుట్టూ అటూయిటూ బంజార రాళ్ళు విలక్షణ ఆకృతుల్లో కారు నిర్మానుష్యంలో ఆగింది.

"దిగుదామా" అడిగాడు. యిద్దరూ దిగి కారు ముందు ఆనుకొని నిలబడ్డారు.

"రండి" అడుగు ముందుకేస్తూ అన్నాడతను.

నడుస్తున్నారు. వొకరి పక్క వొకరు. నిశ్శబ్దమైన శీతాకాలపు సాయంకాలపు చలిగాలి అతని పరిమళాన్ని నింపుకొని ఆమెని హత్తుకొంటోంది. తన కుడిచేతి వేళ్ళతో అతని ఎడమచేతి వేళ్ళని గుప్పిట నింపుకొని నడవాలనే లోలోపలి అలజడిని మౌనంగా నొక్కిపెడుతూ భుజాల చుట్టూ చున్నీని కప్పుకొంటూ రెండు చేతులు కట్టుకొని నడుస్తోందామె.

చిన్నిచిన్న గుట్టలలోంచి నడుస్తూ వో యెత్తైన గుట్టవైపు నడుస్తున్నాడతను.

గుట్ట పూర్తిగా ఎక్కేసరికి పల్చని గోధూళి తెరలా కమ్ముకొంటోంది. చూస్తుండగానే వూదారంగు అలుముకొంటోంది.

చుట్టూ చూస్తున్న ఆమె గుట్ట కిందకి చూసి "బాప్‌రే..." అంది.

అతనివైపు చూసింది. మౌనపు చిరునవ్వు ముఖమంతా. ఆ నవ్వుని స్పర్శించ కుండా వుండలేమని మారాం చేస్తున్న చేతివేళ్ళని నో...నో... అని ఆపుచేస్తూ గాలికి ముఖంపై పడుతోన్న జుట్టుని చెవి వెనక్కి తీసుకొంటూ ఆవైపు చూసింది.

చిన్ని లోయ... క్వారీ రాళ్ళు కొట్టికొట్టి ఏర్పడిన చిన్నిలోయ నిండుగా నీరు... నీలంగా... ఆ నీటిపైనంతా విచ్చుకొన్న కలువపూలు లేత ఆకుపచ్చ ఆకుల నడుమ. సవ్వడిలేని చిన్న తరంగాల కదలిక.

ఆ గుట్ట యేటవాలులో కూర్చుంటూ ఆమెవైపు చూస్తూ "వూఁ యిప్పుడు చెప్పండి... రెండ్రోజులుగా వున్న కోపం పోయిందా" అని అడిగాడు.

అతని పక్క కూర్చుంటూ "నేనెప్పుడూ యీ కలువపూల సరస్సు విషయం విన లేదే... అసలింత మూలనున్న దానిని మీరెలా కనిపెట్టారు" అడిగింది.

"రెండురోజుల స్కోర్ సెటిల్ చేసుకోవాలిగా" చిలిపిగా నవ్వుతూ అంటున్న అతన్ని చూస్తూ 'ఒక్కదానికి తిన్నగా జవాబు యివ్వడు కదా... తిక్క... ఫైటీ తిక్క...' లోలోపల అనుకొంటుంటే ఆమె కళ్ళల్లో చిర్నవ్వు వెలుగు.

"యేంటి" అడిగాడు.

"వుంది. కానీ చెపితే ఆ నీళ్ళల్లోకి తోసేస్తారు" అంది.

"యీతొచ్చా" అడిగాడు

"వొస్తే తోస్తారా రాకపోతే తోస్తారా"

"ఆ విషయం తర్వాత... ముందు చెప్పండి"

చెప్పనన్నట్టు కళ్ళతో చెప్పింది.

ఆకాశంలో మెరుస్తున్న తారకల కింద నుంచి అర్ధ చందమామ పల్చని వెన్నెల వల్లగా జారుతూ కలువపువ్వులపై తడిగా మెరుస్తోంది.

ఆ నిర్మానుష్య గుట్టల నడుమ యిద్దరూ పక్కపక్కన కూర్చుని మౌనంగా ఆ పూల వెన్నెలలని చూస్తున్నారు.

రెండ్రోజులు రాత్రనగా పగలనకా యితను తనని మర్చిపోయాడని బాధ పడ్డాను. బెంగేసింది. తనెంత బిజీగా వున్నా అతను ఫోన్ చేస్తే మాట్లాడుతుంది. అతని

మెసేజ్‌కి జవాబివ్వకుండా వుండదు. అతను పిలిస్తే మీటింగ్‌ని వదిలి వచ్చేసాను. సాయంకాలాలన్నీ అతను కనిపిస్తాడేమోనని యెదురు చూస్తున్నాయ్. యితను తన కోసం యిలా చేస్తాడా... చేయకపోవచ్చు. కానీ రెండ్రోజుల బెంగని అతను మరోలా వ్యక్తపరిచాడు. యిద్దరి మనసుల్లో రాగం వొక్కటే కావొచ్చు. కానీ Expression వేరు. నా Expression లానే యెదుటివాళ్ళది వుండాలను కోవడం లేకపోతే లేదని బాధపడటం యెందుకు... వేర్వేరు Expressions వుంటాయ్. ఆ Expression ని గుర్తుపడితే చాలు. బోల్డంత బాధ తగ్గుతుంది కదా...

"యెక్కడో తప్పిపోయినట్టున్నారు" అన్నాడు.

మౌనంగా నవ్వింది.

యిద్దరు చాలాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

యింటికి తిరగొస్తోండగా అడిగాడు "మీ పని పాడయిందా"

లేదన్నట్టు తలూపింది.

"యీ రెండ్రోజులు పనితో అస్సలు వీలుకాలేదు. రోజూ రాత్రి రెండయేది. అంత రాత్రివేళ డిస్టర్బ్ చేయటం యెందుకులేనని చేయలేదు. మంచి నిద్రలో వుంటారని" అన్నాడు.

"చేస్తే కాస్త కంఫర్టబుల్‌గా పడుకునేదాన్నిగా" అంది.

"యెంత కంఫర్టబుల్‌గా" అడిగాడు.

గేర్ మారుస్తోన్నప్పుడంతా కుడిచేతికి తగుల్తున్న అతని చొక్కా యెడమచేతి ఫుల్‌స్లీవ్స్ చక్కిలిగింతలు పెడుతోంటే చిన్నిగా నవ్వి "యిప్పుడున్నంత" అంది.

"డిన్నర్‌కి వెళదామా" అడిగాడు.

"వూ"

"యెక్కడికి"

"మీ యిష్టం"

"యేం తింటారు"

'మిమ్మల్ని' అని లోపల అనుకొంటూ పైకి "యేమైనా సరే" అంది.

"వెజిటేరియన్"

"వూ"

రెస్టారెంట్ ఆవరణలో కారు పార్క్ చేసాడు.

లోపలంతా లేతగా అమర్చిన వెలుగు. మరీ రద్దీగానూ మరీ పల్చగానూ లేదు రెస్టారెంట్. మెనూ అందుకొని చూస్తూ "చెప్పండి" అన్నాడు.

"మీరే ఆర్డర్ చేయండి. చివరగా కాఫీ... సౌత్ ఇండియన్ కాఫీ మాత్రం కావాలి" అంది.

ఆర్డర్ చేసాడు.

తినటం ముందు త్వరగా సాగి తర్వాత మెల్లగా సాగుతోంది.

"నచ్చలేదా" అడిగాడు.

"ఆకలి తగ్గింది" అంది.

"యేదైనా ముందు కాస్త ఆత్రంగా ఆదుర్దాగా వుంటుంది. ఆకలైనా... స్నేహమైనా" కొంటెగా నవ్వుతూ అన్నాడు.

"వాటికి కావల్సింది దొరుకుతుందో లేదో అనే సందిగ్ధం బెంగగా వుంటుంది" అతనివైపు చురుగ్గా చూస్తూ చప్పున అనేసింది.

బిల్ వచ్చింది.

అతను పే చేయబోతోంటే "నేనూ" అంది.

అతను నవ్వి పే చేసాడు. బేరర్ మిగిలిన చిల్లర బిల్‌ఫోల్డర్‌తో తెచ్చాడు.

ఆమె బిల్ పేపర్ తీసుకొని పడవ చేసింది. ఆ పడవని హేండ్‌బాగ్‌లో వున్న యెడ్రస్‌ల పుస్తకం నడుమ దాచింది. తామిద్దరు తొలిసారిగా రెస్టారెంట్‌కి వచ్చిన జ్ఞాపకపు గుర్తుగా.

✦

తెల్లార్తూనే అతన్నెప్పుడు పలకరిద్దామని సాయంకాలం అతన్ని కలుస్తాననే తలంపు నిండుగా మెదుల్తుంటే వుత్సాహమే వుత్సాహం. ఆఫీసు పనిలో చికాకుల్ని సీరియస్ గా నరనరాల్లోకి యెక్కించుకోవటం తగ్గింది. అతనికి యెలాంటి చికాకు నైనా చెప్పిన క్షణంలో అదెంత చిన్నదో అనవసరమైన టెన్షనో గొప్ప సెన్సాఫ్ హ్యూమర్ తో చెపుతోంటే రానురాను చిన్నచిన్న వాటికి హైరాన పడటం తగ్గింది.

ఆరోజు ఆఫీసులోంచి బయటికి వస్తుంటే సెల్‌కి మెసేజ్ వచ్చింది.

"బంజారాలైన్‌కి పున్నాగపూల దగ్గరికి వొస్తారా" అని అతన్నుంచి.

వస్తానని రిప్లయి యిచ్చింది.

ఆమె అక్కడికి వెళ్ళేసరికి అతను కారుకి ఆనుకొని నిలబడి వున్నాడు. కమ్ముకుంటోన్న దొంతర్లుదొంతర్లుగా పూలసౌరభం పక్కనే అతని సామీప్యపు పరిమళం. ఆమె చూపులు పువ్వుల మీద కంటే అతనివైపు చూస్తామని మారాం చేస్తుంటే వాటిని యేం అనలేక ఆఁ యేమైతే అయిందిలేనని వాటిని వదిలేసింది

వాక్కాయరంగు ప్లేన్ ఫుల్ స్లీవ్స్ షర్ట్... కాస్త వొత్తుగా పెరిగిన నల్లని గెడ్డంలోంచి అక్కడక్కడ తారకల్లా మెరుస్తోన్న వొంటిఛాయ. చూపుడువేలితో ఆ మెరుపుని తాకాలనే చిలిపి కోరిక. అతనేం అనుకుంటాడనే తటపటాయింపు.

"మీకీ సాయంకాలం వేరే పనేంలేదా... యింట్లో వాళ్ళతోనో ఫ్రెండ్స్‌ని కలవటమో, షాపింగ్ యిలా చాలుంటాయి కదా" అడిగాడు.

"అక్కడెక్కడికో వెళితే మిమ్మల్ని కలవటం యెలా"

"నేనొస్తాననో కలుస్తాననో మీరిలా అన్నీ మానేయటం ప్చ్... బరువుగా వుంటుంది. నాకేమో అవన్నీ తప్పవ్... కొన్ని పనులు స్నేహంతో మరికొన్ని బిజినెస్‌పరంగా... రకరకాలుగా... మీరేమో అన్ని మానేసి..." నొచ్చుకుంటూ అన్నాడు.

"చాల యిష్టమైతే తప్ప కొన్ని పనులు చేయలేను. ఆఫీసు పని చేస్తాను. ఆఫీసులో వొంటరితనం. అన్నివిధాలుగా మా భాషలు వేరనిపిస్తాయి. యీ గెట్ టు గెదర్స్‌లో యేముందానే కుతూహలం మొదట్లో వుండేది. వొక్కసారికే బోర్ కొట్టాయి. సోషల్ గేదరింగ్స్ దగ్గర మిత్రులవి అయితే పెళ్ళైనా సీమంతమైనా పుట్టినరోజైనా క్యాజువల్ పార్టీయైనా వరలక్ష్మీవ్రతమైనా క్రిస్మస్ పార్టీ యీద్ పార్టీ దేనికైనా

వెళతా... సందర్భం కంటే మనుష్యుల presence ముఖ్యం. మోహంగా వుంటే అన్నీ వదిలేసుకోవాలనుంటుంది. మీ presence ముందు మిగిలినవి ప్చ్... ముఖ్యమనిపించటంలేదు. యిష్టమైన యెదురుచూపు కదా... మీరెందుకు నొచ్చుకుంటారు" అందామె మెల్లగా. మనసులోనిది చాలా క్యాజువల్‌గా చెపుతోంటే అతనికెంతో ముచ్చటగా ఆశ్చర్యంగా అనిపించి "యెందుకని మీకిలా అనిపిస్తోంది" అడిగాడు.

'యేమో' అన్నట్టు భుజాలతో అంది.

అతనిలో మేఘాలుమేఘాలుగా ఆలోచనలు పరిగెడుతున్నాయి. యెలా మాట్లాడాలో తెలియటంలేదు. యీ మొత్తం యేమిటో... అతనికి మొహమాటం గా అనిపించింది.

"వెళదామా" అడిగాడు.

"అప్పుడే"

"ఐదు నిమిషాలా" అడిగాడు.

"వూ"

అతను ఆమె చేతివైపు చూస్తూ "యిద్దరికి వాచ్ లేదు" అన్నాడు.

"ఫైన్... నేనెప్పుడు చెపితే అప్పుడు ఐదు నిమిషాలు అయినట్టు" అంది.

"అంత శ్రమవొద్దు' అంటూ సెల్‌లో చూసాడు.

"అన్యాయం" అంది.

అతను నవ్వి "మీ టైమ్ మొదలయింది" అన్నాడు.

"నేనేం చెప్పుకోను"

తిరిగి నవ్వాడు. చూపులు టైమ్ నుంచి తీయకుండానే.

ఐదు నిమిషాలు అవ్వగానే "వెళదాం" అని కారులో కూర్చున్నాడు.

ఆమె యింకేం అనలేక తన కారు స్టార్ట్ చేస్తూ "కాఫీ తాగుదామా" అడిగింది.

అతను ప్రవాహంలా నవ్వుతూ "యిప్పటివరకూ వున్నాంగా మీరు తాగండి" అన్నాడు.

"రారా..."

"యేంటీ 'రా' 'రా' నా"

"ఆఁ"

"భయంపోయింది గౌరవం లేదు ఆఁ"

"యేంటీ రా రా అన్నాను అంతేగా"... చప్పున అర్థమై "వో, అలా 'రా' కాదు."

"భయం భక్తి గౌరవపు 'రారా'నే" అంటూ నవ్వింది.

"భలే ట్రిక్కి పదం కదా... యెక్కడ తాగుతారో తాగండి. బై" అన్నాడు.

అతనంత పట్టనట్టు వెళ్ళిపోతోంటే 'యేదో తనుంటే కాఫీ మరింత రుచిగా వుంటుందని రమ్మనటం తప్పా వెళ్ళి కాఫీ తాగలేక కాదు' వుక్రోషంగా అనుకొంది.

యింట్లోకి వెళుతోంటే 'కాఫీ యిస్తారా' మెసేజ్ యిచ్చాడతను.

ఆమె కళ్ళల్లో వెలుగు.

'వూ' అని మెసేజ్ యిచ్చింది. 'యెక్కడ'' అని తిరిగి యిచ్చాడు. 'మా యింటికి రావొచ్చు' అని యిచ్చింది.

అతనొచ్చాడు.

కాఫీ కలుపుతూ "చలి పెరిగింది కదా..." అందామె.

"వూఁ. వుదయమే బయటికి వెళ్ళాల్సి వొచ్చింది. దారి కనిపించనంత పొగమంచు. కారంతా కమ్ముకుపోయింది. ఆ చల్లదనం లోపలికి కూడా పాకిపోయింది. వొళ్ళంతా చల్లగా అయిపోయింది. అప్పుడెంత గుర్తొ..." ఆగిపోయి కాఫీ కప్పు అందుకొంటూ "థాంక్ యూ" అన్నాడు.

"వూ... చెప్పండి" కుతూహలంగా అడిగింది.

"యేంటీ"

"గుర్తొచ్చిందంటూ" ఆత్రంగా అడిగింది.

"యెప్పుడు"

“వుదయం... చలిలో... కారులో చెపుతున్నారుగా” అంది.

“వో... అదా... కాఫీ”

“వూహూ కాఫీనా” వుసూరంటూ “వూ... తాగండి” అంది.

“ఆఁ అలాంటప్పుడు కాఫీ భలే బాగుంటుందికదా. సరిగ్గా యిలాంటి కాఫీ అసలా చలికి యింత వేడి కాఫీ వుంటే క్షణంలో చల్లారిపోతుంది. అంత చలి” యింకా చెబుతూనే వున్న అతన్ని మధ్యలోనే కట్ చేస్తూ “సరే కాఫీ తాగండి యిప్పుడు కూడా చల్లారిపోతుంది” అందామె నిర్లిప్తంగా.

“చల్లని కాఫీ యిష్టం. కోల్డ్ కాఫీ. కోల్డ్ రియాక్షన్”... పెదవులపై నవ్వుని బిగపెట్టినా అతని కళ్ళు నవ్వుతో మెరుస్తున్నాయి.

వంటింట్లోంచి ఆమె వంటింటి గుమ్మంలోంచి అతను యిద్దరూ హాల్లోకి వచ్చారు.

యెల్ షేప్ సోఫా కలిసే మూల కింద కూర్చుని కాళ్ళు చాపుకొని కాఫీ వో సిప్ చేసి టేప్ రికార్డ్‌లోంచి అతి చిన్నగా వినిపిస్తోన్న ‘మేరా కుచ్ సామాన్, తుమ్హారే పాస్ పడాహై...’ పాట వింటూ “సామాను చుట్టూ జ్ఞాపకాలు గమ్మత్తుగా వుంటాయి కదా... వుదయం నుంచి యిటు నుంచి అటు తిరగటం, పని... నిజంగా యింత బిజీ జీవితం అవసరమా అనిపిస్తుంటుంది. అసలు మనకి యిష్టమైన వాళ్ళతో గడపటానికి కూడా టైమ్ లేనంత బిజీ... యెందుకో... మనం మన ఆప్తులతో గడిపే మూమెంట్స్ అవి కదా చాలా యింపార్టెంట్ లైఫ్‌లో... కానీ మన ప్రయారిటీ మాత్రం చాలాసార్లు పని అని అటుయిటు పరిగెత్తటం అవుతోంది... end of the day ప్చ్... యెందుకీ పరుగు అనిపిస్తోంది.

ఆమె సోఫాలో వెల్లకిలా వొరిగి తల కింద చెయ్యి పెట్టుకొని అతనివైపు చూసింది. సోఫా అంచున ఆన్చిన చెయ్యి... బాటిల్ గ్రే ప్లేన్ ఫుల్ స్లీవ్స్ షర్ట్ చివర్ల నుంచి లేత తమలపాకులా మెరుస్తోన్న కుడి అరిచెయ్యి. నల్లని కప్పుపై పచ్చగా మెరుస్తోన్న పల్చని యెడమ చేతివేళ్ళు... అప్పుడప్పుడూ కదుల్తున్నాయి. కప్పు వెచ్చదనానికి... వొక్కసారి ఆ వేళ్ళని స్పర్శించాలే బలమైన తృష్ణ... యెలా వుంటాయో... నెమలి యీకంత మృదువుగా మౌనమంత లలితంగా మంచు బిందువులంత చల్లగా శీతాకాలపు నెగడులా వెచ్చగా వొక్కసారి స్పర్శిస్తే... చూపులన్ని అతని చేతివేళ్ళ మీదే. పున్నాగపువ్వులాంటి సౌగంధపూరిత వేళ్ళ కొనల

మీదే ఆలోచనా స్రవంతి సమస్తమూ నిలిచిపోయి వొకే వొక్క బిందువు దగ్గర ఆగిపోయినట్టు...

ఆమె చూపులు వేళ్ళ చివర్ల మృదువుగా గుచ్చుకొంటుంటే ఆమె కళ్ళల్లోకి మౌనంగా చూస్తున్నాడు. నిశ్శబ్దపు అలజడి పరిమళం మహత్తరంగా ప్రవహిస్తోంది. శీతలత్వం వెచ్చగా అలుముకొంటోంది. రసైకజ్వాలలో వెలుగుతోన్న శీతలత్వపు వివశత్వం... వొక్కసారి ఆ వేలికొసలని స్పర్శిస్తే... ఆమె హృదయంలో వెచ్చగా రాజుకొంటోన్న నిషా... వొక్కసారి ఆ వేలి కొసలని స్పర్శిస్తే యేదో స్మృతిని రేపుతోన్న అతని చూపులు – ఆమె చేతివేళ్ళు చప్పున వెనక్కి వచ్చేసాయి... యెన్నాళ్ళిలా... మంత్రనగరి సరిహద్దులు ముట్టకు.. తాకకు...

✦

వో పక్క పని మరోపక్క రెండ్రోజుల్నుంచి అతన్నుంచి ఫోన్ లేదు. సెల్ ఆఫ్ చేసుంది. యిచ్చిన మెసేజన్‌కి రిప్లయి లేదు. పెండింగ్ అనొస్తున్నాయి.

యేంటో యీ కుర్రాడు...

ఆఫీసు నుంచి బయటికి రాబోతుంటే ఫోన్ మోగింది. తీసింది.

"యేమైపోయారు. గోవా వెళుతున్నా. కాన్ఫరెన్స్. మీకెలా చెప్పాలాని చూస్తున్నా. అయినా నా గొడవే తప్పా... మీకెన్నిసార్లు చెప్పినా చెప్పాపెట్టకుండా మాయమై పోవటమే" అంది త్వరత్వరగా.

"యెలా వెళుతున్నారు," అడిగాడు.

"వయా బెంగుళూర్..." అంటూ తన ప్రోగ్రామ్ చెప్పింది.

"వోకే... టేక్ కేర్... ఆల్ ద బెస్ట్..."

"మీకసలు వూరెళుతున్నాననే బెంగేలేదు. కనీసం యేర్‌పోర్ట్‌లోనైనా కనిపించొచ్చుగా. వూ... వోకే... థాంక్‌యూ..." వుక్రోషంగా అంది.

అట్నుంచి చిన్ని నవ్వు.

"పనిపై అటూయిటూ వెళ్ళటం అలవాటేగా... బెంగెందుకు" అంటూ అతను "బై" అన్నాడు.

అతను రాడని తెలుస్తూనే వున్నా ఆమె కళ్ళు యెయిర్‌పోర్ట్‌లో అడుగు పెట్టినప్పట్నుంచి అతనికోసం వెతుకుతూనే వున్నాయి సెక్యూరిటీ చెక్‌లోకి వెళ్ళబోతూ మరోసారి వెనక్కి చూసింది. అతనెక్కడా కనిపించలేదు. బెంగగా లోపలికి వెళ్ళింది. యెందుకిలా తన మనసెప్పుడూ అతనిని వెతుకుతోందో...

మబ్బుల పై నుంచి పక్క నుంచో వెళుతోన్నా తన మనసు అతనినే అంటిపెట్టుకొని కిటికీలోంచి బయటికి చూస్తోంది. తెల్లని వూదారంగులపై మెరుస్తోన్న చలికాలపు సూర్యరశ్మి తుళ్ళింతగా... అతని నవ్వులా.

కాన్ఫరెన్స్ అయి హాల్లోంచి బయటికి వొస్తోంటే 'హాయ్' అంటూ యెదురొచ్చాడు. అతన్ని చూస్తూనే ఆమె "మీరూ..." ఆశ్చర్యంగా సంబరం వుద్వేగం ఆమె ముఖమంతా.

"కాఫీ తాగుదామా" అడిగాడు.

"వూ" కాఫీ షాప్‌లో వొకరికెదురుగా వొకరు.

"యెప్పుడొచ్చారు... యెలా వొచ్చారు" అడిగింది.

ఆమె చూపుల్లోకి చూపులు ప్రసరిస్తూ "వొచ్చాను" అన్నాడు.

"వచ్చినట్టు తెలుస్తూనే వుంది. యెప్పుడూ యెలా..."

"మీకేం కావాలి"

"యెప్పుడొచ్చారు" తిరిగి అడిగింది.

"తినటానికేం కావాలి" కొంటెగా నవ్వుతూ అడిగాడు.

ఆ స్వరపేటిక తంత్రులకి యీ కొంటెరాగాల మురళిని అద్దిందెవరో అనుకొంటూ 'యీ చెప్పనితనమే ఆకర్షణ' అనుకొందామె.

'కాఫీ' అందుకొంటుంటే ఆమె చూపులు అతని చేతి గోళ్ళపై నిలిచాయ్.

లేత గులాబీగా మెరుస్తోన్న గోళ్ళ వర్ణం. యితనిలో యెప్పుడూ వో కొత్త అందం కనిపిస్తోంటుంది. చిన్నప్పుడు యితను యెలా వుండేవాడో...

"మీ చిన్నప్పటి ఫోటో వొకటి చూపించరా"

హఠాత్తుగా ఆమె అలా అడిగేసరికి "చిన్నప్పటిదా... వొకటా..." అడిగాడు కాస్త అయోమయంగా.

"వూ" అంది.

"యెందుకు"

"చిన్నప్పుడూ యింత అందంగానూ వున్నారా... అసలప్పుడు మీరెలా వున్నారో"

కాఫీని నిశ్శబ్దంగా తాగారిద్దరు.

"బయటికి వెళదామా" అడిగాడు.

"రూంలో యివి పెట్టేసి వొస్తా" అందామె.

"వూ"

"రండి" అంది.

కాన్ఫరెన్స్ పేపర్స్ రూంలో పెట్టి అతనితో బయటికొచ్చింది.

హోటల్లోంచి బయటకొచ్చి పేవ్‌మెంట్‌పై నడుస్తూ యిద్దరూ మెల్లగా బీచ్ వొడ్డుకి వొచ్చారు.

దిగంతంలోకి వాలి వెళ్ళిపోతోన్న సాయంకాలపు సూర్యరశ్మి చిలకరించిన రంగు రంగుల పల్చని కాంతితో మెరుస్తోన్న అరేబియా సముద్రానికి యెదురుగా నిల్చున్నారిద్దరు. అరవిడిచిన తలంటిన జుత్తు సముద్రపు గాలికి రివ్వున యెగురుతో అతని భుజాలకి తాకుతోంది. లేత పసుపురంగు చొక్కాపై పర్చుకొంటోన్న నల్లని జుత్తుని మెల్లగా చేత్తో తాకాలనిపించింది అతనికి. కానీ... యేదో తెలియని సంశయమా... అంతలోనే చూద్దాం... అనే చిన్ని కొంటెతనం.

"విశాఖ సముద్రానికున్న హోరు యే సముద్రానికి వుండదేం" అంది.

అతను చిన్నగా నవ్వుతూ "మీ హృదయాన్ని విశాఖకి తగిలించేసినట్టున్నారు" అన్నాడు.

"అయినా సరే నాకెప్పుడూ హైదరాబాద్ మీదే బెంగగా వుంటుంది. యెక్కడికి వెళ్ళినా సరే యెంత త్వరగా హైదరాబాద్ వెళ్ళిపోదామని వుంటుంది" అంది.

అతను చిన్నగా నవ్వుతూ "యెప్పట్నుంచి" అడిగాడు.

"ఆ... వో... మీరు పరిచయం అయినప్పట్నుంచి" అంది నవ్వుతూ.

చూస్తుండగానే లేత వూదా తెరలని అందుకోవాలని గాఢనీలపు కెరటాల ఆరాటం కమ్ముకుంటుండగా "యెప్పుడొచ్చారు. మీరలా రోజూ మాట్లాడకపోతే యెలా" ఆమె అడిగింది.

అతను వెంటనే మాట్లాడలేదు.

మసక వెల్తుర్లో మెరుస్తోన్న ఆమె చూపులని చూస్తూ "లొకేషన్ లేట్‌గా సెలక్ట్ అయింది. డే అండ్ నైట్ వర్క్ మీతో చెపుదాం అనుకొంటూ కాల్ చేసానా... మీరు గోవా వస్తున్నానన్నారు. అకౌంట్ యిలా సెటిల్ చేయొచ్చనిపించింది" అన్నాడు.

"వో" అంది.

టూరిస్ట్‌ల కోలాహలంతో బీచ్ సందడిగా వుంది.

యిసకలో నడుస్తూ పేవ్‌మెంట్ పక్క నుంచి కాస్త దూరం వచ్చారు. చిన్ని పాత రెస్టారెంట్‌లోంచి పాత గోవా మ్యూజిక్ వినిపిస్తోంటే యిద్దరు వెళ్ళి కూర్చున్నారు. పాత పాటలు వొస్తున్నాయి.

"యేం తింటారు" అడిగాడు.

"మీ యిష్టం" అంది.

అతను ఫుడ్ ఆర్డర్ చేస్తూ మధ్యమధ్య ఆమె అవి తింటుందో లేదో అడుగుతున్నాడు.

"యెన్ని రోజులుంటారిక్కడ" అడిగాడు.

"రేపు సాయంకాలం అయిపోతుంది. యెల్లుండి వుదయం వెళతా."

"మీరు" అడిగింది.

యెప్పటిలానే అతను వెంటనే మాట్లాడలేదు.

అతనివైపు చూసింది. కాండిల్ వెలుగులో గమ్మత్తుగా మెరుస్తోన్న నల్లని గెడ్డం.

మధ్యమధ్యనున్న లేత పచ్చని చర్మం. తడిగా వెలుగుతోన్న చూపులు. 'వెన్నెల్లా మెల్లగా విస్తరించుకొనే యితని సౌందర్యానికి వొణుకుతోన్న మనసుకి యే వెచ్చని జావళి కప్పుకోవాలో...' అని ఆమె అనుకొంటుండగా "రేపు యిక్కడ్నుంచి వూరెళుతున్నా" అన్నాడు.

"యే వూరు" అడిగింది.

"స్విట్జర్లాండ్" అన్నాడు.

"వూరు అన్నారు"

"గ్లోబల్ విలేజ్" అంటూ విశాలమైన చిలిపి నవ్వు.

"అంత దూరమా"

"యెంత వారమేగా"

"వారమా..." బెంగగా అడిగింది.

"చూడు... వూరు కదలాలంటేనే నేనెంతో నాకు నేనే నచ్చజెప్పుకుంటా... యిప్పుడిలా మీరు బెంగపడితే చాలా కష్టంగా వుంటుంది. వెళ్ళలేను. వెళ్ళక తప్పదు" అన్నాడు.

ఆమె కళ్ళల్లో బెంగ చూసి "వచ్చేస్తారా" అడిగాడు.

"ఆఁ"

"అంత దూరం"

"యెంత... గ్లోబల్ విలేజ్ కదా"

"అక్కడికి వో గ్రూపుతో వెళుతున్నాం. ఖాళీ వుండదు. మీరొచ్చినా వొక్కరే చాలా సేపు గడపాల్సి వొస్తుంది. నా ప్రెజెన్స్ అప్పుడు చికాకు కలిగిస్తుంది. వారంలో వచ్చేస్తా" మెల్లగా నచ్చజెపుతున్నట్టు చెప్పాడు.

అదీ సంగతి. వారంరోజులు వెళ్ళాలి. రేపంతా యిద్దరం బిజీ. అయినా సరే యీ దొరికిన సమయాన్ని గడపొచ్చని యిలా బయటికి తీసుకురావటం. యితని వ్యక్తీకరణంతా గమ్మత్తుగా వుంటుంది. యేది డైరెక్ట్‌గా చెప్పకపోవటం... ఆ

చెప్పకపోవటం ఆదుర్దా కలిగిస్తూనే వుంటుంది. కాని అతనిలోని వెచ్చదనం మౌనంగా యింకుతోంటే ఆమె అతనివైపు చూస్తోంది.

పదవుతోంటే "వెళదామా" అడిగాడు.

"అప్పుడే"

"వూ"

"మళ్ళీ వో వారంవరకు కనిపించరు కదా... యింకాసేపుందాం" అంది.

"కాస్త పనుంది"

"రేపు చూసుకోండి" యిద్దరూ కాసేపు ఆ సముద్రం వొడ్డున తిరిగారు. ఆ చలిని తట్టుకోలేక "మా రూంకి వెళదాం రండి" అంది.

యిద్దరు రూంలోకి వచ్చారు. ఆమె సౌత్ యిండియన్ కాఫీ ఆర్డర్ చేసింది. అతను సోఫాకి ఆనుకొని కింద కాళ్ళు చాపుకొని కూర్చున్నాడు. ఆమె సోఫాపై వెల్లకిలా వొరిగి తల కింద వో చేయి ఆన్చుకొని. అతని పల్చని శరీరపు యింటిమేట్ పరిమళం ఆమెకి తగుల్తుంది. పల్చని నల్లని గెడ్డపు చివర్లు తాకాలని ఆ వొత్తైన తేనెరంగు క్రాఫంతా చెరిపేయాలని అర్ధచంద్రుని నుదిటిపై చేతివేళ్ళ కొసల నుంచి తాకాలని అతని సాన్నిధ్యపు పరిమళాన్ని మోహంగా స్పర్శించాలని తన్మయత్వంతో మంచుతుంపరలా కమ్ముకోవాలి...

"బాగా అలిసిపోయారా" అడిగాడు.

"వూహూ"

"బెంగగా వుండొద్దు.. వారంరోజుల్లో వస్తా" చెప్పాడు.

"మీరొచ్చాక సంతోషంగా వుంది" అందామె.

"నాకిదంతా strange గా వుంది" అన్నాడు.

"వూ"

అతను నవ్వాడు గోరువెచ్చగా...

తెలతెలవారే వరకూ యిద్దరూ అలానే వొకర్నొకరు చూసుకొంటూ మౌనంలోకి చిర్నవ్వుల్లోకి బెంగల్లోకి స్పర్శించుకొంటూ...

స్విట్జర్లాండ్ వెళ్ళేముందు సెక్యూరిటీ చెక్‌లోకి వెళ్ళబోతూ కాల్ చేసాడు. బెంగ తప్పా మరేం ప్రవహించని కాలమది.

అక్కడికి వెళ్ళగానే అక్కడి మొబైల్ నెంబర్స్‌తో మెసేజ్ యిచ్చాడు.

సాయంకాలం నుంచి అర్ధరాత్రి వరకు మిస్ అవుతోన్న అతని సాన్నిధ్యం... కాఫీ పరిమళాల్లోంచి రేకెత్తించే జ్ఞాపకాల మాటలు... తెల్లారేక సోఫా పక్కన కనిపించే రాత్రి తాగిన కాఫీ కప్పులు కనిపించకపోవటం... యింత బెంగలో సాయంకాలం నుంచి అతన్నుంచి వొచ్చే మెసేజ్‌లు అదే అల్లరి అదే కొంటెతనం తనకి యెక్కడా దొరకని చిలిపితనం... వారంరోజులు అయిపోయాయి. అతని పని కాలేదు... మరో వారం అనగానే పొగమంచులా కమ్ముకొన్న బెంగ వొంటరితనం...

అసలిదంతా యేంటీ... యింత యిష్టం... యింత మోహం యింత బెంగా... వూరికే పోవటమేనా... అర్థవంతపు స్నేహాలని జీవితంలోకి అనువదించుకోవటం... పదిలంగా కాపాడుకోవటం... యింత వొత్తైన యిమోషన్స్ కొనసాగటం అన్నది యిద్దరి మీదా ఆధారపడిన సంగతి... కొనసాగాలని యిద్దరికి వుండాలి... యెమోషనల్ సబ్‌మిసీవ్‌గా వుండటం నో... అతనికి నాకు మధ్య వున్నది యేమిటి... యీ మంత్రనగరి సరిహద్దులు తాకాలనే క్యూరియాసిటి... తాకితే యేమవుతుందో ననే బెంగ తాకకపోతే యెలా... యెవరు ముందు... యే మోహపు జడివానలోనో జలపాతపు హోరులోనో చలిగాలుల లాలిత్యానికో యెప్పుడో వొకప్పుడు... యింకా యెన్నాళ్ళు అక్కడ... రారాదూ త్వరగా చూడాలి... లాలిత్యం పరుచుకొన్న నీ చేతివేళ్ళ కొనల్ని మృదువైన నీ హృదయపు స్నేహాన్ని స్పర్శించాలి. మెలకువగా... కలత నిదురలో మోహపుస్వప్నంలా...

రాత్రి తాలూకు మోహపు బెంగ కొద్దిగానైనా వదిలిపోకుండానే అప్పుడే తెల్లవారింది.

పావు తక్కువ ఆరు.

వూఁ... యింకా ఐదు నిమిషాలు... అనుకొంటూ మునగదీసుకు పడుకొంది. వూహూ... అనుకొంటూ అటుయిటూ తిరుగుతూ ప్చ్! యిలా కాదు... లేవాలి... చాలా పనుంది. వూహూ... యిది యిలా వదలదు... కాఫీ... చిక్కని సౌత్ యిండియన్ కాఫీ... యస్ గుడ్ ఐడియా... బోర్ ఐడియా... అటు తిరుగుతోంటే... సెల్‌లో మెసేజ్ వచ్చిన సవ్వడి... చేయి చాచి సెల్ అందుకొని మెసేజ్ వోపెన్ చేసింది.

'How is the young lady... coming... coffee...' టైమ్ చూసి నెంబర్ చూసింది.

లోకల్ నెంబర్...

వో... వచ్చేసావా... లేచి మంచంపై కూర్చుంది.

గదంతా మసక వెల్తురు.

కిటికి దగ్గరికి వచ్చింది కర్టెన్ లాగింది. జివ్వుమంది. కిటికి పల్చని గ్లాసంతా మబ్బుమబ్బుగా అలుముకొన్న మంచు.

వో... ఆ గ్లాసుపై నుదురు అన్చింది. ఆకృతి యేర్పడినంత వేగంగా అలుముకొంటున్న మంచు... కుడిబుగ్గ... యెడమబుగ్గ... ముక్కుకొన... చేతివేళ్ళు.. చుబుకం... పెదవులని అన్చింది. గుండ్రని చిన్ని పెదవుల ఆకృతిపై రివ్వురివ్వున ఆవిరిలా పాకుతోన్న మంచు. కళ్ళల్లో చిలిపినవ్వు ప్రవహిస్తోంటే నాలిక కొన చివర్నుంచి గ్లాసుపై వొక్కో అక్షరం రాస్తుండగానే చరచరా ఆవిరిలా అలుముకొంటున్న మంచు. తిరిగి అతని పేరులోని మొదటి అక్షరాన్ని రాస్తోంటే కమ్ముకొంటున్న ఆవిరి మంచుని చూస్తూ 'దొంగా...' కళ్ళల్లోని పెదవులపై బుగ్గల్లో యెడమబుగ్గ డింపుల్లో అలాఅలా ముఖమంతా ప్రవహిస్తోన్న నవ్వు మోహంగా.

కాలింగ్‌బెల్ సవ్వడి. తలుపు తీసింది.

నవ్వుతూ అతను సుమప్రభాత పరిమళంలా.

అతను లోపలికి వచ్చాడు.

"దా... కాఫీ యిస్తాను" అందామె.

"వూ యేంటి విషయాలు" అడిగాడు.

ఆమె అతనివైపు చురుగ్గా చూస్తూ "యిన్ని రోజులా" అని ఆగి - "యేంటీ నేనెప్పుడూ యెవరి విషయం యింతగా ఆలోచించలేదు" అంది.

"సో... ఆలోచిస్తున్నావన్నమాట" అల్లరిగా నవ్వుతూ అడిగాడు.

"సందేహమా. యీ మోడ్రన్ లైఫ్‌లో మెటీరియలిస్టిక్ ప్రపంచంలో వున్నాగలని యిష్టపడే వో కుర్రాడు వుంటాడని నేనెప్పుడూ అనుకోలేదు."

“యింత కాంప్లెక్స్ ప్రపంచంలో మీలాంటి అమ్మాయిని నేనూహించలేదు.

మీ ఆలోచనలతో నేనెప్పుడూ తబ్బిబ్బు కాలేదు. మీ ప్రెజెన్స్ చాలా శాంతిగా వుంటుంది” అన్నాడు.


“వో నా real being మీరేననిపిస్తోంది” కాఫీ అందిస్తూ అంది.

కాఫీ తాగి ‘వెళతా’ అన్నాడు.

“అప్పుడేనా” ఆమె స్వరంలో బెంగ.

ఆమెవైపు చూసాడు.

చూపుల నిండుగా మోహపు బెంగ పరిమళిస్తోంది. యిద్దరు వొకరివైపు మరొకరు. యెవరి చేతులు యెవరిని ముందుగా పెనవేసుకున్నాయో మంత్రనగరి సరిహద్దులని చెరిపివేస్తూ వారిరువురి మనోదేహ స్పర్శాలింగనంలో జీవితానందం పరిమళిస్తోంది.



*ఆదివారం వార్త*
*8 జూన్ 2003*